దుర్గమ్మా..దీవించవమ్మా..


విశేష అలంకారంలో శ్రీ విజయదుర్గమ్మ

ఘనంగా ప్రారంభమైన అమ్మవారి బ్రహ్మోత్సవాలు

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో 21వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేద పండితులు రాయపెద్ది సుబ్బరాయశర్మ శాస్త్రోక్తంగా పూజలతో ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్ దంపతులు ఉభయదారులు, భక్తులతో కలిసి గణపతి పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణ తదితర పూర్వాంగ కార్యక్రమాలను చేపట్టారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం నుంచి ఈనెల 7వ తేదీ వరకు ప్రతిరోజు అమ్మవారికి విశేషంగా పంచామృతాభిషేకాలు జరుగుతాయి.గణపతి, చండీహోమాలు, నవావరణ శ్రీ చక్రార్చన నిర్వహిస్తారు. 7న శ్రీ విజయదుర్గాదేవి కడపలో వెలిసిన పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం ఊజల అనంతరం సాయంత్రం 4.00 గంటల నుంచి ఆలయ ఆవరణలో శ్రీ విజయదుర్గ, మల్లికార్జునుల కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారని ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జున రావు తెలిపారు.


ఆలయంలో బ్రహ్మోత్సవాల అంకురార్పణ పూజలు


విద్యుత్ దీప వెలుగులో ఆలయం

క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం

కడప అర్బన్/పెండ్లిమర్రి: కడప నగరానికి చెందిన విద్యాసాగర్ ఆర్థరైటిస్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ప్రముఖ కీళ్లమార్పిడి శస్త్రచికిత్స వైద్య నిపుణులు డాక్టర్ సి. విద్యాసాగర్ రెడ్డి స్వీయ పర్యవేక్షణలో శుక్రవారం పెండ్లిమర్రి మండలం తిప్పరాజుపల్లెలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.. ఈ శిబిరంలో తిప్పరాజుపల్లెవాసులే గాక, నల్లయ్యగారిపల్లె, గొందిపల్లె, బాలయ్యగారిపల్లెల నుంచి కూడా ప్రజలు పాల్గొన్నారు. దాదాపు 150 మందికి పైగా వైద్య శిబిరానికి రాగా వారికి మోకాళ్ల నొప్పులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామపెద్దలైన యరికలరెడ్డి, మల్లేశ్వర్ రెడ్డి, ద్వారకారెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సీఎస్‌కు అభినందనలు


ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న శ్రీనివాసులు తదితరులు

కడప రూరల్: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె. జవహర్‌రెడ్డి కడపకు వచ్చిన సందర్భంగా శుక్రవారం ఆర్ అండ్ బీ గెస్ట్ హౌలో ఏపీ ఎన్జీఓ అసోషియేషన్ జిల్లా నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ అసోషియేషన్ జిల్లా అధ్యక్షులు బీ శ్రీనివాసులు, కార్యదర్శి డీ రవికుమార్, ఉపాధ్యక్షులు టీ శ్రీనివాసులు, నగర అధ్యక్షులు కే చిన్నయ్య, నాగార్జున, పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతివ్వండి


ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతివ్వాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్. వెంకట్రామిరెడ్డి, రాము, ప్రసాద్‌రెడ్డి కోరారు. శుక్రవారం వారు గురుకుల్ విద్యాపీఠ్, నెహ్రూపార్కు, మున్సిపల్ స్టేడియం వద్ద కరపత్రాలు పంచి వెన్నపూస రవీంద్రారెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

నగరాభివృద్ధిలో అసమానతలు తగదు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కడప నగరపాలక సంస్థ అభివృద్ధి విషయంలో అసమానతలు చూపడం సరికాదని సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నగరంలో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలన్నారు.లోహియానగర్‌లో మంచి నీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై నగరపాలక సంస్థ అధికారులు స్పదించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చంద్రా రెడ్డి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షాన సీపీఐ పోరాటాలు


మాట్లాతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: పేదల పక్షాన సీపీఐ పోరాటాలు చేపడుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలోని హోచిమన్ భవన్‌లో పార్టీ నగర సమితి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లోని ఇళ్లకు సామగ్రి పెరిగిన నేపథ్యంలో ధరలకు అనుగుణంగా రూ. 5లక్షలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వెంకట శివ, మద్దిలేటి, నాగరాజు, పుల్లయ్య, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఘనంగా వీడ్కోలు

కడప సిటీ: వైఎస్‌ఆర్ జిల్లా పర్యటనను ముగించుకుని శుక్రవారం రాత్రి తిరుగు పయనమైన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్. జవహర్ రెడ్డికి రేణిగుంట విమానాశ్రయంలో ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు, జేసీ సాయికాంత్ వర్మ, కడప మునిపిపల్ కమీషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్, ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా తదితరులు వున్నారు.


రేణిగుంట విమానాశ్రయంలో ప్రభుత్వ సీఎస్‌కు వీడ్కోలు పలుకుతున్న జిల్లా కలెక్టర్

వైవీయూలో కేంద్ర బడ్జెట్‌పై జాతీయ వెబినార్

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం రాజనీతిశాస్త్రం, ప్రజాపరిపాలన విభాగం ఆధ్వర్యంలో 'యూనియన్ బడ్జెట్-2023-24 పర్సెప్షన్ ఆఫ్ ఎ నీడోనోమిక్స్' అన్న అంశంపై జాతీయ వెబినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం ఆచార్య జింక రంగజనాథన్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య కె.కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య టి. శ్రీనివాస్, డీన్ ఆచార్య టి. రామప్రసాద్‌రెడ్డిలు బడ్జెట్ ప్రాముఖ్యతను గురించి అవగాహన కల్పించారు. ముఖ్యవక్తగా వర్చువల్ విధానంలో హాజరైన కురుక్షేత్ర విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సలర్ ఆచార్య మదన మోహన్ గోయెల్ మాట్లాడుతూ మనం భారత్ ప్రగతి కోసం నీడోనోమిక్స్ సూత్రాలను అర్థం చేసుకోవాలని సూచించారు. అనంతరం బడ్జెట్‌పై విశ్లేషనాత్మక సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా. డి. రవీంద్ర, సతీష్‌బాబు, పార్వతి, ప్రమీళమార్గరేట్, వినయ్, రామయ్య, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైవీయూ వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య టి. శ్రీనివాస్

వాణిజ్యశాస్త్రశాఖ ఆధ్వర్యంలో..

బడ్జెట్ దేశప్రగతిలో కొత్తరూపురేఖలపై వైవీయూ వాణిజ్యశాస్త్రశాఖ ఆధ్వర్యంలో విశ్లేషణాత్మక సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైవీయూ వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య టి. శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ఉపన్యసించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఆచార్య ఎస్. రఘునాథ రెడ్డి, ఆచార్య విజయభారతి, డా. సుదర్శన్‌రెడ్డి, డా. హరనాథలు బడ్జెట్ గురించి మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు రజనీ, మహమ్మద్‌రఫీ, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి


విజేతలుగా నిలిచిన విద్యార్థినులతో అధికారులు

అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డా.ఖాదర్‌వలి

వైవీయూ : కుష్టువ్యాధి పట్ల అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా అదనపు వైద్య,ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఖాదర్‌వల్లి పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంపై కళాశాల రెడ్‌రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధి లక్షణాలు కనిపిస్తే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. సుబ్బలక్షుమ్మ మాట్లాడుతూ యువత హెచ్ఐవీ/ఎయిడ్స్‌బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలనిసూచించారు. అనంతరం విద్యార్థినులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ మనోహర్, భాస్కర్, రెడ్‌రిబ్బన్ క్లబ్ పీఓ డా.జి. విజయలక్ష్మీదేవి, విద్యార్థినులు పాల్గొన్నారు.

గంజాయి తీవ్ర హానికరం

కడప కోటిరెడ్డిసర్కిల్ : గంజాయి వాడటం తీవ్ర హానికరంగా మారుతుందని రైల్వే ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసులు, మహమ్మద్‌బాబు తెలిపారు. శుక్రవారం రైల్వే డీజీపీ, గుంతకల్లు ఎస్పీల ఆదేశాల మేరకు ప్రయాణికులు, ఆటో డ్రైవర్లకు గంజాయిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంజాయి వాడటం వల్ల భవిష్యత్తును పాడుచేసుకోవడంతోపాటు కుటుంబాలు వీధి పాలవుతాయన్నారు. ముఖ్యంగా యువత గంజాయికి దూరంగా ఉండాలన్నారు. గంజాయి రవాణాకు సంబంధించిన సమాచారాన్ని పోలీసు వారికి అందించాలన్నారు. మెరుగైన సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఎస్ఐలు రారాజు, శంకర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.


ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న రైల్వే అధికారులు

ఎస్సీ ఎస్టీలు చైతన్యవంతం కావాలి


కొత్తపాటి సుబ్బమ్మకు నియామక పత్రం అందిస్తున్న జయచంద్ర

కడప రూరల్: ఎస్సీ, ఎస్టీ వర్గాలు హక్కుల సాధన కోసం చైతన్యవంతం కావాలని ఆల్ ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు వైకుంఠ జయచంద్ర అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ ప్రెస్‌క్లబ్‌లో సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి ఆల్ ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో సంఘం బలోపేతానికి పర్యటనలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా కొత్తపాటి సుబ్బమ్మను నియమించారు. మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాయలసీమ కమిటీ అధ్యక్షులు సొరకాయల వెంకటస్వామి, అనంతపురం జిల్లా అధ్యక్షులు పెనుగొండ నాగభూషణం, దస్తగిరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బైక్‌పై దూసుకెళ్లిన లారీ

- త్రుటిలో తప్పిన ప్రమాదం



కడప అర్బన్: కడప చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చెత్త లారీ డ్రైవర్ అదుపుతప్పడంతో తమ నివాసం ఎదుట పార్కింగ్ చేసి వుంచిన కుమార్ రెడ్డి అనే వ్యక్తికి సంబంధించిన మోటార్‌సైకిల్‌పైకి దూసుకుని వెళ్లింది. ఆ సమయానికి ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

డ్రోన్ ద్వారా వైఎస్సార్ జగనన్న భూ రక్ష, భూ సర్వే

చెన్నూరు : వైఎస్సార్ జగనన్న భూ రక్ష, భూ రీ సర్వేను డ్రోన్ ఫ్లై ద్వారా శుక్రవారం మండలంలోని ఉప్పరపల్లె గ్రామ పంచాయతీ దుగ్గనపల్లెలో చేపట్టినట్లు మండల సర్వేయర్ సోమశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుగ్గనపల్లె గ్రామ పొలాల్లో 1457.73 ఎకరాలలో నిర్వహిస్తున్నామని, ఇక్కడ రైతులకు సంబంధించి సుమారు 750 ఖాతాలు ఉన్నాయని తెలిపారు. ఈ సర్వేలో ఆర్థో రెక్టిపై ఇమేజ్ (ఓఆర్ఐ) చేయడం ద్వారా భూ సర్వేకు సంబంధించిన ఫొటోలు రెండు నెలల తర్వాత వస్తాయని ఆయన తెలిపారు. అనంతరం రైతులతో సమావేశం ఏర్పాటు చేసి వారికి అవగాహన కల్పించారు. రైతులకు సంబంధించిన భూములు సరిహద్దులు, గట్లు ఈ సర్వేలో వస్తాయని ఆయన రైతులకు తెలిపారు. గతంలో భూ సర్వేకి సంబంధించి రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే వారని ప్రస్తుతం అలాంటి బాధలు లేకుండా ప్రభుత్వమే రైతులకు సంబంధించిన భూములను సర్వే చేసి వారికి భూ సరిహద్దులను చూపిస్తుందన్నారు. ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టినందుకు రైతులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షుడు ఎరసాని మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ నిరంజన్‌రెడ్డి, వీఆర్వో వెంకటసుబ్బయ్య, సర్వేయర్ పవన్‌కుమార్, విలేజ్ సర్వేయర్లు, కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.


భూ సర్వేకు సిద్ధంగా ఉన్న డ్రోన్ పరికరం

రాజ్యాంగ హక్కుల రక్షణకు పనిచేద్దాం

కడప కల్చరల్ : రాజ్యాంగం మనకు కల్పించిన హక్కుల రక్షణకు, వాటిపట్ల అవగాహన కోసం సంస్థ ప్రతినిధులు అంకితభావంతో పనిచేయాల్సిన అవసరం ఉందని లోకా సమస్థ హ్యూమన్ రైట్స్ బోర్డు ఆఫ్ డైరెక్టర్ ఏబీ నళినినాయుడు తెలిపారు. శుక్రవారం ఆమె కడపలోని సంస్థ జిల్లా కార్యవర్గ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సంస్థ నగర మహిళా విభాగం చైర్ పర్సన్ ఎ.లక్ష్మిభవాని ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నళినినాయుడు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించి వారిలో చైతన్యం తేవడమే సంస్థ ముఖ్య ఉద్దేశమన్నారు. వ్యవస్థాపకులు, సంస్థ జాతీయ చైర్మన్ జీపీ నరసింహులు ఆలోచనల మేరకు సభ్యులంతా సమాజ సేవకు పాటుపడాలని కోరారు. అనంతరం నూతన సభ్యులకు గుర్తింపుకార్డులు, నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ కర్ణాటక మహిళా విభాగం ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఏవీ మధుమతి, ఏపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.రాము, జిల్లా కార్యదర్శి కె.విజయభాస్కర్, మహిళా విభాగం వైస్ చైర్ పర్సన్ విజయమ్మ, పట్టణ మహిళా విభాగం వైస్ చైర్మన్ సుమలత, ఎగ్జిక్యూటివ్ సభ్యులుస్వర్ణగౌరి, ప్రొద్దుటూరు పట్టణ ఈసీ సభ్యులు ఎన్.సుధీర్‌కుమార్, జమ్మలమడుగు పట్టణ చైర్మన్ బి.నరసింహులు, శారద, స్వప్న, భారతి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.


సంస్థ ప్రతినిధులతో లోకాసమస్థ హ్యూమన్ రైట్స్ బోర్డు ఆఫ్ డైరెక్టర్ ఏబీ నళినినాయుడు

చిరువ్యాపారులపై ట్రాఫిక్ పోలీసుల వేధింపులు ఆపాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగరంలోని చిరువ్యాపారులపై ట్రాఫిక్ పోలీసుల వేధింపులను ఆపాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు దిశా పోలీస్ స్టేషన్ ఎదురుగా రోడ్డు పక్కన బుట్టల్లో జామ, బొప్పాయి, సపోట పండ్లను అమ్ముకొని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ట్రాఫిక్ పోలీసులు లేనిపోని నిబంధనలతో అమ్మకాలను నిలిపివేయడం బాధాకరమన్నారు.సుప్రీం కోర్టు 2014లో చట్టాన్ని తీసుకొచ్చి చిరు వ్యాపారులు జనావాసాల మధ్య వ్యాపారాలు నిర్వహించుకునేందుకు అవకాశం కల్పించాలని ప్రభుత్వాలకు అదేశాలు ఇచ్చిందని, ఇది గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కేసీ బాదుల్లా, మైనుద్దీన్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.


ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న చిరువ్యాపారులు

ఏపీ మోడల్ స్కూల్ పరిశీలన

వల్లూరు : మండలంలోని గంగాయపల్లె ఏపీ మోడల్ స్కూల్‌ను ఈఎండీపీ జిల్లా మేనేజర్ లక్ష్మీ నరసింహుడు శుక్రవారం సందర్శించి పరిశీలించారు. ఎస్‌సీఈఆర్టీ మరియు సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో తొమ్మిదవ తరగతి విద్యార్థులలో 21వ శాతాబ్దపు నైపుణ్యాలను మరియు వ్యవస్థాపక మనస్తత్వాన్ని అభివృద్ధి చేయుటకు పాఠశాలలో నిర్వహిస్తున్న వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం(ఈఎండీపీ) అమలు తీరును ఆయన పరిశీలించారు. శిక్షణలో అభ్యసించిన అంశాలను గురించి విద్యార్థులతో ఆరా తీశారు. మార్చి మాసంలో జరగబోయే ప్రాజెక్ట్ ఎక్స్‌పో గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు వ్యవస్థాపకత ఆకాంక్ష మరియు అత్యుత్తమ కెరీర్‌ను ఎంచుకునే సామర్థ్యాలను పెంపొందించడానికి ఎంతగానో ఉపయోగపడతాయని కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు తెలిపారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు ప్రదర్శించారు.


విద్యార్థులతో ఈఎండీపీ జిల్లా మేనేజర్ లక్ష్మీ నరసింహుడు

266 కేసులు నమోదు

కడప అర్బన్: ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు శుక్రవారం పోలీసులు వాహనాల స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపిన వారిపై 266 కేసులను నమోదు చేశారు. వీటిలో ప్రధానంగా హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనాలు నడిపిన వాహనదారులపై 214 కేసులు, సీటు బెల్ట్ ధరించకుండా వెళ్తున్న కార్లు, జీపులు తదితర వాహనదారులపై 52 కేసులను నమోదు చేశారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

కడప అర్బన్: కడప నగరంలోని తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో భగత్ సింగ్‌నగర్‌లో వున్న కాశినాయన ఆశ్రమంలో వుంటూ భిక్షాటన చేసుకుని జీవనం సాగిస్తున్న రామయ్య (56) అనే వ్యక్తి మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో అతనికి కడుపునొప్పి, ఉబ్బసం తీవ్రంగా వచ్చింది. తట్టుకోలేక తాను ఉంటున్న ఆశ్రమంలో రేకులషెడ్డు పైభాగాన వున్న రాడ్డుకు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈసంఘటనను శుక్రవారం ఉదయం గుర్తించారు. మృతుని కుమారుడు శివయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

ఇద్దరు మట్కా బీటర్ల అరెస్ట్

కడప అర్బన్: కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కుమ్మరికుంట కొట్టాలు సమీపంలో శుక్రవారం సాయంత్రం మట్కా ఆడుతున్న షేక్ అన్సర్, అమీర్‌లను సీఐ సయ్యద్ హసం తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 5950 నగదును, మట్కా స్లిప్‌లను స్వాధీనం చేసుకున్నారు.

- వివిధ ప్రదేశాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతుండగా సీఐ హసం ఆధ్వర్యంలో 16 మందిపై కేసులు నమోదు చేశారు.

ఘనంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

వల్లూరు : పాపాఘ్ని నదీ తీరాన మండలంలోని పైడికాలువ గ్రామంలో వెలసిన శ్రీరాజ్యలక్ష్మీ సమేత చెన్న కేశవస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవ, కుంభాభిషేక మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు స్వామి హరినారాయణ ఆధ్వర్యంలో వేద పండితులు ప్రారంభించారు. అనంతరం వివిధ హోమాలను నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందచేశారు.


ప్రత్యేక అలంకరణలో ఉత్సవ మూర్తులు

వైభవంగా శివ పార్వతుల కల్యాణం

వల్లూరు : మండలంలోని పెద్ద లేబాక, బక్కిరెడ్డిపల్లె గ్రామాల సరిహద్దున నూ తనంగా నిర్మించిన శ్రీ సిద్ధేశ్వరస్వామి ఆలయంలో మూడవ రోజైన శుక్రవా రం శివ పార్వతుల కల్యా ణ మహోత్సవం ఘనంగా జరిగింది. వేద పండితులు శేఖర్ శర్మ ఆధ్వర్యంలో గడియారం ప్రసాద్ శర్మ బృందం కల్యాణంను కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం విగ్రహ ప్రాణ ప్రతిష్ఠా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఏపీఎస్ ఆర్‌టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డిలు ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో శివకుమార్‌రెడ్డి, ఈశ్వరరెడ్డి, చంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి, పుల్లారెడ్డి, రామాంజనేయరెడ్డి, రాజారెడ్డి, బాలయల్లారెడ్డి, శంకర్‌రెడ్డి, సిద్దారెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

సాగులో మెలకువలు అవసరం

చింతకొమ్మదిన్నె : పంటల సాగుకు మెలకువలు అవసరమని జేడీఏ నాగేశ్వరావు రైతులకు తెలిపారు. శుక్రవారం మండలంలోని కొలుములపల్లె రైతు భరోసా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ఆర్‌బీకేలో రిజిష్టర్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. రైతులు అడిగిన పంటల వివరాలను తెలియజేయాలన్నారు.